
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

గురువారం 25 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.50 (120.8990)	నిల్	9,447
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.80 (3.64)	1,362.14	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	102 (0.94)	509	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.142 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



డిండి ప్రాజెక్ట్

ఆశల పల్లకిలో..

రాష్ట్ర 2024-25 ఆర్థిక సంవత్సరానికి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌పై ఉమ్మడి నల్లగొండ జిల్లావాసుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టే బడ్జెట్ జిల్లా ఆకాంక్షలను నెరవేర్చేందుకు పునాది వేస్తుందనే ఆశాభావం వెల్లడవుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం, ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌కు దన్నుగా 11 ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లు సైతం దక్కడంతో అంతేస్థాయిలో బడ్జెట్ కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందనే నమ్మకం నెలకొంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- ఉమ్మడి జిల్లా పథకాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం
- ఎస్ఎల్‌బీసీకి అగ్రతాంబూలమనే సంకేతాలు
- ఎత్తిపోతల పథకాలకు అధిక నిధులకు అవకాశం
- విద్య, వైద్యరంగాలకు ఊతం దక్కుతుందని ఆశాభావం
- ప్రతిష్ఠాత్మక రీజనల్ రింగురోడ్డు, ఫిలింసిటీ, మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులు వస్తే ఉమ్మడి జిల్లాకు మహర్దశే

ఉమ్మడి జిల్లా నుంచి కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తోన్న భారీ నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాలశాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం ఉమ్మడి జిల్లా పర్యటనల్లో జిల్లా ప్రాధాన్య ప్రాజెక్టులు, పథకాలకు నిధులు తెస్తామని ప్రకటిస్తున్నారు. ఎమ్మెల్యేలు సైతం తమ నియోజకవర్గాల్లో సాగు నీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పథకాలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలకు బడ్జెట్‌లో స్థానం దక్కుతుందనే విశ్వాసంతో ఉండడంతో ఈ బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల కేటాయింపులుండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వైద్యరంగం బలోపేతానికి..

పేదలకు నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ఈ బడ్జెట్‌లో నిధులిస్తారని భావిస్తున్నారు. ప్రధానంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీమండల కేంద్రంలో 30పడకల ఆస్పత్రి ఏర్పాటు, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రుల ఏర్పాటును ప్రకటిస్తారని ఆశాభావం వెల్లడవుతోంది. మోత్కూరు, మునుగోడు పీహెచ్‌సీలను 30 పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడేషన్‌కు నిధులిస్తారని భావిస్తున్నారు. వీటితోపాటు జిల్లా కేంద్రాల్లోని జనరల్ ఆస్పత్రులకు నిధులతోపాటు, ఖాళీలున్న డాక్టర్ పోస్టుల నియామకానికి ప్రకటన చేస్తారని ఆశాభావం వెల్లడవుతోంది. ప్రధానంగా నల్లగొండ లో నిర్మాణం దాదాపు పూర్తయిన మెడికల్ కాలేజీ భవనాన్ని పూర్తిచేసేందుకు నిధు ల కేటాయింపుతో పాటు, సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు భరో సా కల్పించాలని కోరుతున్నారు.

ఉద్యోగ భరోసా కల్పించే విద్యాసంస్థల ఏర్పాటుకు ఛాన్స్



రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు తక్షణ ఉపాధి అవకాశాలు కల్పించేలా ఐటీఐలను ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు)లుగా మారుస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించడంతో పాటు, ఐటీఐల ఆధునికీకరణ మొదలవడంతో ఉమ్మడి జిల్లాలోని 14 ఏటీసీలలో ఈ కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటితోపాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేర్కొంటున్న స్కిల్ యూనివర్సిటీని కూడా నల్లగొండలో ఏర్పాటు చేయిస్తారనే చర్చ సాగుతోంది. బడ్జెట్‌లో దీనిపై స్పష్టత రానుంది. వీటితోపాటు హుజూర్‌నగర్‌లో పీజీ కాలేజీ, నార్కట్‌పల్లిలో డిగ్రీ కాలేజీ, మిర్యాలగూడలో మహిళా డిగ్రీ కాలేజీ, మునుగోడులో డిగ్రీ, జూనియర్ కాలేజీలు, కోదాడలో డిగ్రీ, జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదం లభిస్తుందని, హాలియాలో ఇప్పటికే ఉన్న డిగ్రీ కాలేజీకి నూతన భవన సదుపాయాలు కల్పిస్తారని ఆశిస్తున్నారు.

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, ఫిలిం సిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు



యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాచకొండ ప్రాంతంలో ఫిలింసిటీ ఏర్పాటు చేయిస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఈ మేరకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులుండవచ్చని భావిస్తున్నారు. అదేవిధంగా ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న రీజనల్ రింగ్‌రోడ్డు దక్షిణ భాగానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే వెంటనే భూసేకరణ చేపట్టి, టెండర్లు ఆహ్వానిస్తారని అంచనా వేస్తున్నారు. మరో కీలక ప్రాజెక్టుగా భావిస్తున్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తే, తద్వారా ఉమ్మడి జిల్లాలోని మూసీ నది ప్రక్షాళన కావడంతోపాటు, మూసీ ఆధారితంగా సాగు నీటి ప్రాజెక్టులు, మత్స్య పథకాలకు ఊతం దక్కుతుందని తద్వారా జీవన ప్రమాణాల పెంపునకు దోహదమవుతుందని అంచనావేస్తున్నారు.

ఎస్ఎల్‌బీసీ పూర్తికి గ్రీన్‌ఛానల్

జిల్లాలో దాదాపు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం ఎడమగట్టుకాల్వ సొరంగమార్గం ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో అగ్రస్థానం దక్కబోతోందనే సంకేతాలున్నాయి. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేసే లక్ష్యంతో రూ.2200 కోట్ల నిధులను గ్రీన్‌ఛానల్‌లో ఉంచుతామని ఉమ్మడి జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఆ మేరకు ఈ పథకానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు డిండి ఎత్తిపోతల పథకానికి సైతం అంతే స్థాయిలో నిధులు మంజూరు చేసి పథకాన్ని రెండేళ్లలో పూర్తిచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఎస్ఎల్‌బీసీలో అంతర్భాగంగా చేపట్టిన ఉదయ సముద్రం- బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకం కింద పెండింగ్ పనులకూ ఈ బడ్జెట్ ద్వారా నిధుల కేటాయింపులుంటాయని అంచనా వేస్తున్నారు. వీటితో పాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణ పెండింగ్ పనులతోపాటు, ఉమ్మడి జిల్లాలో అసంపూర్తి నిర్మాణంతో నిలిచిన చిన్న ఎత్తిపోతల పథకాల పూర్తికి, పాత లిఫ్టుల ఆధునికీకరణకు, నిర్వహణకు ఈబడ్జెట్ ద్వారా నిధుల కేటాయింపులుంటాయని భావిస్తున్నారు. వీటితోపాటు బునాదిగాని కాల్వ, పిలాయిపల్లి కాల్వ, బెండలమ్మ చెరువు, శేషలేటివాగు ఫీడర్ ఛానల్, కొండాపురం ఫీడర్ ఛానల్ నిర్మాణాలకు నిధులిస్తారనే నమ్మకం కనిపిస్తోంది. గంధమళ్ల రిజర్వాయర్ నిర్మాణంతోపాటు, బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలకు పరిహారం ప్రకటిస్తారని తెలుస్తోంది. మరోవైపు శ్రీరాంసాగర్ రెండోదశ చివరి ఆయకట్టు భూములకు నీరందించేందుకు కాల్వల ఆధునికీకరణకు నిధులివ్వాలనే డిమాండ్‌కు మోక్షం లభించాలని కోరుతున్నారు.



తొలుగుతున్న అవాంతరాలు

భువనగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేశ్‌రెడ్డి

ఆన్‌లైన్‌లో ప్రారంభమైన ఎన్ఎంసీ రెండో దశ తనిఖీలు

భువనగిరి టౌన్, జూలై 24: జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటులో నెలకొన్న తాత్కాలిక అవాంతరాలు క్రమేపీ తొలగుతున్నాయి. వైద్యకళాశాల ఏర్పాటులో అత్యంత కీలకమైందిగా పరిగణించే జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తనిఖీలు రెండోసారి సాగుతున్నాయి. ఎన్ఎంసీ నియమించిన బృందం మొదటిసారి జూన్ 24న వైద్య కళాశాల బోధనాస్పత్రిగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ గుర్తించిన భువనగిరి జిల్లా ఆస్పత్రిని సందర్శించి చెక్‌లిస్టు ఆధారంగా తనిఖీలు చేసింది. కానీ వైద్య కళాశాల ఏర్పాటుకు సంతృప్తికరమైన వసతులు, సదుపాయాలు తదితర సాంకేతిక కారణాలు చూపుతూ అప్పట్లో కళాశాల ఏర్పాటుకు లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌వోపీ) ఇవ్వలేదని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రమేశ్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజారాంతోపాటు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లతో కలిపి సుమారు 35మందికి పైగా బదిలీలపై వచ్చారు. త్వరలో మరికొంతమంది రానున్నట్లు తెలుస్తోంది. అలాగే ఇక్కడినుంచి కూడా పలువురు వైద్యులు బదిలీలపై వెళ్లారు. నర్సింగ్, అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాల్లో కూడా వైద్యకళాశాల ప్యాట్రన్ మేరకు బదిలీలు జరిగాయి. వైద్యశాఖలోనే అత్యంత సీనియర్లు ప్రిన్సిపల్‌గా, సూపరింటెండెంట్‌గా రావడంతోపాటు బదిలీలపై పెద్దసంఖ్యలో వైద్యులు రావడంతో వైద్యకళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న పట్టుదలకు నిదర్శనమని వైద్యశాఖాధికారులు అంటున్నారు. అదే సమయంలో ఎన్ఎంసీ రెండో దశ తనిఖీలు రెండు రోజుల క్రితం ఆన్‌లైన్‌లో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. దీంతో కళాశాల అనుమతుల సాధనే లక్ష్యంగా జిల్లా పాలనా యంత్రాంగంతోపాటు ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ పేపర్ వర్కులో నిమగ్నమయ్యారు.

తుది దశకు మౌలిక వసతుల కల్పన

అంతేగాక వైద్యకళాశాల ఏర్పాటు చేయనున్న పాత కలెక్టరేట్‌లో ల్యాబ్‌లు, బోధనా సామగ్రి, హాస్టల్లో బెడ్‌లు తదితర మౌలిక వసతుల కల్పన తుది దశకువచ్చాయి. భవనం అద్దెను కూడా అధికారులు ఖరారు చేసినట్టు, కలెక్టరేట్ పెండింగ్ అద్దెను కూడా త్వరలో క్లియర్ చేసేందుకు అధికారులు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే కింది స్థాయి నియామకాల కోసం ఇటీవల నోటిఫికేషన్ జారీ అయ్యింది. నీట్ పేపర్ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతంలో తిరిగి నీట్‌ను నిర్వహించాల్సిన అవసరంలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి త్వరలో కౌన్సిలింగ్ జరగనుంది. దీంతో కౌన్సిలింగ్ షెడ్యూల్ వెలువడే నాటికి భువనగిరి ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు ఎన్ఎంసీ అనుమతులు లభిస్తాయని రాష్ట్ర వైద్యశాఖతోపాటు కళాశాల ప్యాట్రన్ విశ్వాసంతో ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో 50సీట్లతో భువనగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభమయ్యే అవకాశాలు మెరుగయ్యాయి. దీంతో జిల్లా ప్రజల ప్రభుత్వ వైద్య కళాశాల ఆకాంక్ష నెరవేరనుండటంతోపాటు అర్హులైన జిల్లా విద్యార్థులకు స్థానికంగానే ఎంబీబీఎస్ చదువుకునే అవకాశాలు లభించనున్నాయి.

జీవో నెం.50ను వెంటనే రద్దు చేయాలి

చౌటుప్పల్ న్యాయవాదుల డిమాండ్

కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా

చౌటుప్పల్ టౌన్, జూలై 24: చౌటుప్పల్ కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన సబ్‌కోర్టును రామన్నపేటకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.50ను వెంటనే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రామన్నపేటలో సబ్‌కోర్టును ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.50ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చౌటుప్పల్‌లోని జూనియర్ సివిల్ కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. జీవో నెం.50ను నిరసిస్తూ మూడురోజుల పాటు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. జీవో నెం.50ను రద్దు చేసే వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామని న్యాయవాదులు ప్రతిజ్ఞచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, జిల్లాలో రెండో అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఉన్న చౌటుప్పల్ పట్టణాన్ని కాదని రామన్నపేటలో సబ్‌కోర్టును ఏర్పాటు చేయడం సముచితం కాదన్నారు. ఇక్కడ రెవెన్యూ డివిజన్‌తోపాటు ఏసీపీ కార్యాలయం, జాతీయరహదారి, మునిసిపల్ కార్యాలయం వంటి ప్రధాన కార్యాలయాలు ఉన్నాయని, చౌటుప్పల్‌లో సబ్‌కోర్టును ఏర్పాటు చేస్తే అటు కక్షిదారులకు, ఇటు న్యాయవాదులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. 62 శాతం కేసులు ఉన్న చౌటుప్పల్‌ను కాదని, కేవలం 38శాతం కేసులు మాత్రమే ఉన్న రామన్నపేటలో సబ్‌కోర్టును ఏర్పాటు చేయడం సరికాదన్నారు.



చౌటుప్పల్ కోర్టు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్ కోర్టు పరిధిలోని చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు చెందిన కక్షిదారులు రామన్నపేట వెళ్లాలంటే అనేక ఇబ్బందులు అధిగమించాల్సి ఉంటుందన్నారు. రామన్నపేటలో సబ్‌కోర్టును ఏర్పాటుచేస్తూ జారీ చేసిన జీవో నెం.50తో చౌటుప్పల్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జీవోను రద్దు చేసే వరకూ పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. జీవో రద్దుకోసం సాగిస్తున్న ఉద్యమానికి రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలబడాలన్నారు.

ధర్నాలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు రాపోలు వేణు, ముత్యాల సత్తిరెడ్డి, తాడూరి పరమేష్, జిల్లా రమేష్, పి.మహిపాల్ రెడ్డి, బాల్యం వెంకటాచలపతి, ఎ.శ్రీనివాస్, వి.నర్సింహారెడ్డి, తడక మోహన్, బడుగు శ్రీకాంత్, స్వాతి, జక్కర్తి శేఖర్, శ్రీశైలం, ఎండీ ఖయ్యూమ్ పాషా, సత్యనారాయణ, పాల పరమేష్, భిక్షమయ్య, బిక్షపతి, రాఘవేంద్ర, భరత్, జ్యోతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మూసీలో ప్రవాహ ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే

బీబీనగర్, జూలై 24: హైదరాబాద్ ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీకి ఏ క్షణంలోనైనా వరద ఉధృతి పెరిగే ప్రమాదం ఉందని, ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. బుధవారం బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి, జూలైరు గ్రామాల మధ్య మూసీపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మూసీలో నీటి ప్రవాహం పెరిగినట్లయితే బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి మార్గంలో రాకపోకలను నిలిపివేయాలని, వాహనాదారులు లోలెవల్ బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగించకుండా భారీ కేడ్లు ఏర్పాటుచేసి హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. అలాగే బ్రిడ్జి వద్ద సిబ్బందితో 24గంటలపాటు కాపలా ఉంచాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



బీబీనగర్ మండలం రుద్రవెల్లి -జూలూరు గ్రామాలమధ్య మూసీ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

రైతు బీమాను వినియోగించుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ



రాజాపేటలో బీమాపత్రం అందజేస్తున్న వ్యవసాయ అధికారి అనురాధ

రాజాపేట, జూలై 24: అర్హులైన రైతులందరూ రైతుబీమాను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ కోరారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలో రైతు వేదికలో బీమా దరఖాస్తులను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు రుణమాఫీ, బీమా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జూలై 30 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు బీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాధవి, విస్తరణ అధికారులు అంజయ్య, ప్రణీత, పీఏసీఎస్ సీఈవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో రైతులు మెలకువలు పాటించాలి

భువనగిరి రూరల్: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు, మెలకువలు పాటించి అధిక దిగుబడి సాధించాలని భువనగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు భూక్య దేవ్‌సింగ్ అన్నారు. క్రాప్ బుకింగ్‌లో భాగంగా బుధవారం భువనగిరి మండలం చందుపట్లలో రైతులు సాగు చేసుకుంటున్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్షం కారణంగా పత్తి పంటకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి : ఏడీఏ దేవ్‌సింగ్

జూన్ 28వరకు కొత్త పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన, ఇప్పటి వరకు రైతు బీమా చేసుకోలేక పోయిన రైతులు ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ దేవ్‌సింగ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులన్నారు. ఆధార్‌కార్డులో 18 ఏళ్ల నిండి ఉండి 59 ఏళ్లలోపు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాలన్నారు.

సంస్థాన్‌నారాయణపురం: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం జిల్లాశాఖ ఆధ్వర్యంలో సంస్థాన్‌నారాయణపురంలో సాగు చేస్తు న్న పత్తి పంటను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు బి.అనిల్ కుమార్, కె.మమత పరిశీలించారు. పత్తి పంటలను పరిశీలించి రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అధిక సాంద్రత, పత్తి సాగులో సమయానుకూలంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సాగు భూముల్లో పోలీస్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయవద్దు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

సంస్థాన్‌నారాయణపురం జూలై 24: ఎన్నో ఏళ్లుగా రైతులు సాగుచేసుకుంటున్న భూముల్లో పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేయొద్దని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన బెటాలియన్ ప్రతిపాదిత భూములను బుధవారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం యువజన సంఘాలతో కలిసి వెంకట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత రైతుల పక్షాన సీపీఎం పోరాడుతుందన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారానే పోలీసు శిక్షణ శిబిరాన్ని వెనక్కి పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి యాదిరెడ్డి, నాయకులు శ్రీనివాసాచారి, తుమ్మల నర్సిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చింతకాయల నర్సింహ, బొమ్మగోని శంకరయ్య, చాడ నరసింహ, రాచకొండ కృష్ణ, కోట రమేష్, ఆనగంటి వెంకటేశం పాల్గొన్నారు.



బెటాలియన్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న వెంకట్



చౌటుప్పల్‌లో జమదగ్ని ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

వైభవంగా ఎల్లమ్మ బోనాల జాతర



చౌటుప్పల్ పట్టణంలోని 10వ వార్డులో మంగళవారం రాత్రి జమదగ్ని ఎల్లమ్మ బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో కౌన్సిలర్ బొడిగె అరుణా బాలకృష్ణ, సీతారామ చంద్ర స్వామి దేవాలయ మాజీ చైర్మన్ బొబ్బిళ్ల మురళీ, ఉత్సవ నిర్వాహకుడు జోగిని సుధా,సాయి, శైలజ,ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

- చౌటుప్పల్ టౌన్

అంగన్‌వాడీ పిల్లలకు నాణ్యమైన ఆహారం

జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి కృష్ణవేణి

భూదాన్‌పోచంపల్లి, జూలై 24: అంగన్‌వాడీ పిల్లలకు నాణమైన ఆహారం అందజేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి కృష్ణవేణి అన్నారు. బుధవారం ఆమె భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలు, తల్లులతో మాట్లాడుతూ ప్రీస్కూల్, గ్రోత్ మేళా గురించి వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. వానాకాలంలో వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. అంగన్‌వాడీకేంద్రాల్లో పిల్లలకు ఆట పాటలతో విద్యనందిస్తామని, ఈ అవకావాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ మంగ, ఆయా, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.



జలాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కృష్ణవేణి

దుకాణ యజయానులపై కేసు నమోదు

ఆత్మకూర్(ఎం), జూలై 24: బాలకార్మికులను పనిలో పెట్టుకున్న ఇద్దరు దుకాణం యాజయానులపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా శిశు సంరక్షణ యూనిట్ సోషల్ వర్కర్ ఎం.మత్స్యగిరి తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ చౌటుప్పల్ టీం సభ్యులు ఏఎస్ఐ సర్వర్, ఎస్ సతీష్ , డీ లింగం, సరితలు బుధవారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. బైక్ మెకానిక్, హోటళ్లలో పనిచేస్తున్న ఇద్దరు బాలకార్మికులను గుర్తించారు. బాలకార్మికులతో పనిచేయిస్తున్న యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకారమండపంలో నిత్యకల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 24 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో అర్చించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు పూర్తి చేశారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి శైవాగమ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.10,67,521 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ రాజు, హెడ్‌కానిస్టేబుళ్లు వెంకటయ్య, రామకృష్ణ, యాకయ్య, సురేష్, మహేందర్ ఆరుగురు ఎస్‌పీఎఫ్ సిబ్బంది హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పుట్టిన రోజు సందర్భంగా ఆలయంలో స్వామి అమ్మవార్లకు అర్చన, సువర్ణపుష్పార్చన పూజలుజరపగా,వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

అసెంబ్లీ లాబీలో గుట్ట ప్రసాదం పంపిణీ



ఆలేరు రూరల్, జూలై 24 : సీఎం రేవంత్‌రెడ్డి రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ అసెంబ్లీ లాబీలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రసాదాన్ని మంత్రులకు, శాసనసభ సిబ్బందికి, జర్నలిస్టులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన శాసనసభలో మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా ఉన్నతీకరణ చేయాలని ప్రభుత్వ వీప్ బీర్ల అయిలయ్య అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుని, తండాలను అభివృద్ధి చేయకుండా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో 5,848 తండాలు ఉండగా కేవలం 1,271 తండాలను మాత్రమే పంచాయతీలుగా మార్చారని, నిధులు ఇవ్వకుండా అభివృద్ధి చేయలేదన్నారు. కాంగ్రెస్ ఎస్టీ, ఎస్సీల సంక్షేమ ప్రభుత్వమని తండా పంచాయతీలకు భవనాలను నిర్మిస్తామన్నారు.

డీఎస్ఆర్ పద్ధతిలో వరిసాగు అభినందనీయం

రామన్నపేట, జూలై 24 : వెదజల్లే పద్ధతి ద్వారా 85 మంది రైతులు దాదాపు 300 ఎకరాల్లో వరి సాగు చేయడం అభినందనీయమని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్, డాక్టర్ జీ రత్నాకర్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామంలో భారతీయ వరి పరిశోధన సంస్థ, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీఎస్ఆర్ ఫౌండేషన్ సహాయంతో గ్రామంలో బుధవారం వరిసాగులో డైరెక్ట్ సీడ్ రైస్(డీఎస్ఆర్) విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడారు. రైతుల సందేహాల నివృత్తి కోసం ఉత్తరాఖండ్, ఒడిషా, అస్సాం రాష్ట్రాలకు చెందిన సీనియర్ శాస్త్రవేత్తల బృందం చిల్ల వెంకన్న పొలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఏ సమస్య ఉన్న శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకోవాలని కోరారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐఐఆర్ఆర్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంగళ్‌దీప్ డీఎస్ఆర్ సాగులో వచ్చే సమస్యలు, పాటించాల్సిన జాగ్రత్తలు పొలం వద్దనే భూసారపరీక్ష నిర్వహించే కిట్ వాడడం గురించి రైతులకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మహేంద్రకుమార్, మిలన్‌జ్యోతి కోన్వర్, ప్రాజెక్ట్ మేనేజర్ డీ శ్రీనివాస్, టీ శ్రీకాంత్, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు, మాజీ సర్పంచ్ పిట్ట కృష్ణారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ పిట్ట రాంరెడ్డి, సామాజిక కార్యకర్త వేముల సైదులు, ముద్రబోయిన శ్రీశైలం, కిషన్‌రావు, కమలాకర్, దుఖేందర్, వెంకన్న, మురళీకృష్ణ, రమేష్, మల్లేష్, సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పీల్చి తప్పించుకోలేరు!

- ● డ్రంకెన్ డ్రైవ్ మాదిరి గంజాయి తాగే వారిని గుర్తించే అవకాశం
- ● పోలీస్‌స్టేషన్లకు చేరిన పరీక్షల కిట్లు



గంజాయి వాడే వారిని గుర్తించే పరీక్షల కిట్

సూర్యాపేట క్రైం, జూలై 24 : మద్యం మత్తులో వాహనాలు నడిపే వారికి పోలీసులు జరిపే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల మాదిరే గంజాయి పీల్చే వారిని గుర్తించేందుకు ప్రత్యేక కిట్లు సూర్యాపేట జిల్లాకు చేరుకున్నాయి. ప్రస్తుతం మద్యంతో పాటు గంజాయి తాగే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా యువత, విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారుతున్నారు. గంజాయి మత్తులో యువత అనేక ఆగడాలకు పాల్పడుతోంది. పలుచోట్ల ఘర్షణలు, ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వారి జీవితాలు నాశనం అవుతున్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలన కోసం శ్రీకారం చుట్టింది. గంజాయి విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా నార్కోటిక్ బ్యూరో బృందాలను ఏర్పాటుచేసింది. ఇప్పటివరకు పోలీసులు వారివారి ప్రాంతాల్లో గంజాయి రవాణా, వాడకాలపై నిఘా ఏర్పాటు చేసి వారి పరిధిలో సాధ్యమైనంత వరకు కేసులు నమోదుచేస్తున్నారు. అయినప్పటికీ గంజాయి విక్రయాలు, రవాణా, వాడకం మాత్రం పెరుగుతూ పోతోంది. ఈ క్రమంలో గంజాయి పీల్చేవారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. అందుకోసం కొత్తగా గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక కిట్లను జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించారు. ఎవరికైనా గంజాయి పీల్చే అలవాటు ఉందని అనుమానం వస్తే వెంటనే ఈ కిట్ల ద్వారా పరీక్షలు జరుపనున్నారు.

పరీక్ష చేసే విధానం

గంజాయి అలవాటు ఉందనే అనుమానం ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు జరపనున్నారు. అనుమానం ఉన్న వ్యక్తి మూత్రాన్ని గంజాయి కిట్లలో పోసి దాని ద్వారా గంజాయి అలవాటు ఉందా లేదా అనేది నిర్ధారించనున్నారు. ఒక వ్యక్తి యొక్క శరీర ధృడత్వాన్ని బట్టి మూడు నెలల నుంచి ఆరు నెలల వ్యవధిలో గంజాయి వాడినప్పటికీ పరీక్షల్లో బయటపడుతుంది. దీంతో గంజాయి అలవాటు ఉన్నవారు ఈ పరీక్షల ద్వారా తప్పించుకునే అవకాశం లేదు. కాగా మూత్ర పరీక్షల అనంతరం నిందితుడు గంజాయి వినియోగించాడా లేదా అన్నది మాత్రమే తెలియనుందని సమాచారం. కిట్లలో పాజిటివ్, నెగిటివ్‌లు రిపోర్టులు వస్తాయని పోలీసులు తెలిపారు. పూర్తిగా వైద్యుల పర్యవేక్షణలోనే పరీక్షలు ఉంటాయని తెలిపారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు

సూర్యాపేట జిల్లాలో గంజాయిని నిర్మూలించేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఎక్సైజ్ శాఖతో సమన్వయం చేస్తూ గంజాయితో కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. విద్యాసంస్థల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీల ద్వారా విద్యార్థులు, యువత ఎవరైనా గంజాయిని వాడితే సమాచారం తెలుసుకుని చర్యలు చేపట్టేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ఇప్పటికే గంజాయి కేసుల్లో పట్టుబడ్డ వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రభుత్వం నుంచి డీఅడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించేందుకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ప్రయత్నాలు చేస్తున్నారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం



జిల్లాలో గంజాయిని నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గతంలో పోలిస్తే గంజాయి రవాణా కొంతమేర తగ్గింది. ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి గంజాయి రవాణా, విక్రయాలపై దృష్టి పెట్టాం. గంజాయి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలి. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నాం. కొత్తగా వచ్చిన గంజాయి పరీక్షల కిట్ల ద్వారా గంజాయి వాడే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తాం.

\- సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ, సూర్యాపేట జిల్లా

సూర్యాపేట జిల్లాలో నమోదువుతున్న కేసులు

సూర్యాపేట జిల్లాలో గంజాయి విక్రయాలు, రవాణా, వాడకాలకు సంబంధించి పోలీసులు కేసులు నమోదుచేస్తున్నారు. 2023లో జిల్లావ్యాప్తంగా 27 కేసులు నమోదు కాగా ఆయా కేసులకు సంబంధించి 70 మంది అరెస్ట్ చేసి వారి నుంచి 631 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 23 కేసులు నమోదు చేసి 53మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 26కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రతి రోజూ జిల్లాలో ఎక్కడో ఒక చోట గంజాయి విక్రయించే, రవాణా చేసే, వాడే వ్యక్తులు పోలీసులకు పట్టుబడుతున్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

● ఫస్టియర్ ఫస్ట్ సెమిస్టర్‌లో ఫెయిల్ ● ఈ నెల 15న ఆత్మహత్యాయత్నం

మద్దిరాల, జూలై 24: బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపంతో ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుక్కడం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుక్కడం గ్రామానికి చెందిన బింగి సోమయ్య-పద్మ దంపతులకు కుమార్తె అక్షిత(18), కుమారుడు ఉన్నారు. సోమయ్య కుటుంబంతో సూర్యాపేటలో ఉంటూ కూలి పనులు చేస్తూ పిల్లలను చదివిస్తున్నాడు. అక్షిత ఓ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 15వ తేదీన రెండో సెమిస్టర్ పరీక్షలు రాస్తుండగా మొదటి సెమిస్టర్ ఫలితాలు వచ్చాయి. అందులో అక్షిత ఫెయిల్ కాగా, మనస్తాపానికి గురైంది. అదేరోజు మధ్యాహ్నం ఇంటికి వచ్చిన అక్షిత ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న పలు రకాల మాత్రలు అధిక మోతాదులో మింగింది. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన తల్లి పద్మ నీరసంగా ఉన్న కుమార్తె అక్షితను ప్రశ్నించగా, మాత్రలు మింగానని తెలిపింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మంగళవారం హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించటంతో ఇంటికి తీసుకువస్తుండగా బుధవారం మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహానికి తుంగతుర్తి ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

అప్పులబాధతో మహిళా కూలీ ఆత్మహత్య


లక్ష్మి(ఫైల్‌ఫొటో)

తిప్పర్తి, జూలై 24 : అప్పులబాధతో ఓ మహిళా కూలీ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన నల్లగొండ లక్ష్మి(40) కూలీ పనిచేస్తుండగా భర్త నాగయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని నెలలుగా ఆటో సరిగ్గా నడవకపోగా భార్య లక్ష్మి అనారోగ్యం బారిన పడడంతో చికిత్స నిమిత్తం రూ.3 లక్షల మేర అప్పులు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మి ఈ నెల 21వ తేదీన తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. తాగినకొద్ది సమయానికి గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమార్తె జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు. లక్ష్మికి భర్తతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డుదాటుతుండగా లారీ ఢీకొని మహిళ మృతి


చిన్ని(ఫైల్)

కొండమల్లేపల్లి, జూలై 24 : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో బుధవారం రోడ్డుదాటుతుండగా లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. ఏఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామునిగుండ్లతండాకు చెందిన రమావత్ చిన్ని స్వగ్రామం నుంచి దర్వేశిపురంలోని బంధువుల ఇంట్లో జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద రోడ్డు దాటే క్రమంలో జడ్చర్ల నుంచి కోదాడ వెళ్తున్న లారీ మూలమలుపు వద్ద సాగర్ రోడ్డు వైపు మళ్లే క్రమంలో చిన్నిని ఢీకొట్టింది. లారీ వెనుక టైర్ కిందపడిన చిన్ని తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. చిన్నికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

యాదగిరిగుట్ట మండలంలో...

యాదగిరిగుట్ట రూరల్, జూలై 24 : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో రోడ్డుదాటుతుండగా బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. సీఐ రమేష్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భువనేశ్వర్‌సింగ్(40) మండలంలోని వంగపల్లి గ్రామంలోని ఎంఎస్ఎన్ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. కంపెనీలో విధులు ముగించుకుని గ్రామంలో కూరగాయల కొనుగోలు కోసం వరంగల్-హైదరాబాద్ జాతీయరహదారి దాటుతుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై వస్తూ అతడిని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. దాంతో భువనేశ్వర్‌సింగ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

బైక్, ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలోని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం బైక్, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగపల్లి గ్రామానికి కానుగంటి వినయ్ పనుల నిమిత్తం బైక్‌పై భువనగిరి వెళ్తున్నాడు. అదే సమయంలో వంగపల్లి గ్రామానికి చెందిన ఆటో ఎదురుగా వస్తుండగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న కానుగంటి వినయ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భూమి తగాదాలో ఒకరికి గాయాలు

మద్దిరాల, జూలై 24 : భూమి కోసం జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలైనట్లు సూర్యాపేట జిల్లా మద్దిరాల ఎస్ఐ మధునాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన గాడుదల గౌరవయ్య, గాడుదల రమేష్ వ్యవసాయ భూమి విషయంలో బుధవారం ఘర్షణపడ్డారు. గౌరవయ్య చేతిలో ఉన్న పారతో రమేష్‌పై దాడికి దిగాడు. రమేష్‌కు గాయాలు కావడంతో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ గుడ్లలో పురుగులు


కోడిగుడ్లలో పురుగులు

భువనగిరి టౌన్, జూలై 24 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో అందజేసిన కోడి గుడ్లలో పురుగులు కనిపించాయి. వివరాల్లోకి వెళితే బంజారాహిల్స్‌లోని అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో ఓ మహిళ 15 రోజుల క్రితం ప్రసవించింది. అప్పటికే ఆమె ఏడాదిన్నర వయస్సు గల పాప కూడా అదే అంగన్‌వాడీ కేంద్రంలో నమోదై ఉంది. దీంతో ఇరువురు పౌష్టికాహారం కోసం కేంద్రానికి రాలేని పరిస్థితి ఉండటంతో కుటుంబసభ్యులకు శనివారం టీచర్ శ్రీలత ఈ నెల 20న టేక్ హోం రేషన్(టీహెచ్ఆర్) రూపకంలో కోడి గుడ్లు తదితర పౌష్టికాహారాన్ని అందజేసింది. గుడ్లను బుధవారం ఉడకబెట్టేందుకు చూడగా ఓ గుడ్డులో పురుగులు కన్పించాయి. దీంతో బాలింత కుటుంబసభ్యులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీడీపీవో రేకల స్వరాజ్యం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పురుగులు వచ్చిన గుడ్డును పరిశీలించి బాలింత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ నెల 10న అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా కాగా ఇప్పటివరకు వాటి నాణ్యతపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, పగిలిన గుడ్డును నిల్వగా ఉంచడంతోనే పురుగులు వచ్చినట్లు పరిశీలనలో తేలిందన్నారు. అయితే కోడి గుడ్డులో పురుగులు కన్పించడంపై సమగ్ర విచారణ జరపాలని ఆ బాలింత కుటుంబ సభ్యులతో పాటు పలు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

యాదగిరిగుట్ట రూరల్, జూలై 24 : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేటలో విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన గంగదారి రమేష్‌కు చెందిన పాడి ఆవు గడ్డిమేస్తుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు రమేష్ కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

తిరుమలగిరి, జూలై 24: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం కేఆర్‌కేతండా వద్ద ఆటోట్రాలీలో అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఆటోను తనిఖీ చేశామన్నారు. ఆటోలు 40బస్తాల్లో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, యాదాద్రి జిల్లా పుట్టగూడెం గ్రామానికి చెందిన మాడోతు ఘన్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆవు దూడలను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

కొండమల్లేపల్లి, జూలై 24 : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలకేంద్రంలో బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు ఆవు దూడలను తరలిస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాలోని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌లోని తుక్కుగూడకు డీసీఎంలో 70 ఆవు దూడలను తరలిస్తున్నారు. అదే సమయంలో వాహనతనిఖీలు చేస్తున్న పోలీసులు డీసీఎంలో ఆవుదూడలను గుర్తించి, డ్రైవర్‌ను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలపడంతో డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఆవు దూడలను మరో వాహనంలో చండూరులోని యాగతులసి గోశాలకు తరలించినట్లు ఎస్ఐ రాంమూర్తి తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ జగన్‌నాయక్, కానిస్టేబుల్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి మూసీ కాల్వలకు నీటి విడుదల

- ● ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- ● పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో నీటి నిల్వలు
- ● 10వ డిస్ట్రిబ్యూటరీ వద్ద కోతకు గురైన కాల్వ కట్ట


నీటితో తొణికిసలాడుతున్న మూసీ జలాశయం

కేతేపల్లి, జూలై 24: నాగార్జునసాగర్ తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద సాగునీటి ప్రాజెక్టుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వలకు గురువారం నుంచి నీటిని విడుదల చేయనున్నారు. మూసీ ప్రాజెక్టులో నీటినిల్వలు పుష్కలంగా ఉండడంతో వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆయకట్టులోని 35వేల ఎకరాల్లో పంటల సాగు కోసం నీటిని విడుదల చేయనున్నారు. ఆయకట్టుకు సాగునీటిని అందించాలని కోరుతూ ఇటీవల కుడి కాల్వ పరిధిలోని గ్రామాలకు చెందిన పలువురు రైతులు, రైతు ప్రతినిధులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నీటిపారుదల శాఖ సూర్యాపేట సర్కిల్ ఎస్ఈ శివధర్మతేజ్‌లను కలిసి విన్నవించారు. ఈ క్రమంలో మూడు రోజులుగా ప్రాజెక్టుకు ఎగువనుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో ప్రాజెక్టులో నీటిమట్టం 645అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలోకి వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 25నుంచి నీటిని విడుదల చేస్తామని నీటిపారుదల శాఖ సూర్యాపేట సర్కిల్ ఎస్ఈ శివధర్మతేజ్ రైతులకు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు. నీటి విడుదలతో ఆయకట్టు గ్రామాల చెరువులు, కుంటల్లోకి నీరు చేరనుంది. దీంతో చెరువులు, కుంటల ఆయకట్టు భూముల్లోనూ పంటలు సాగుకానున్నాయి. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా నీటి విడుదల చేయనున్నట్లు మూసీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది ప్రాజెక్టులో నీటి నిల్వలు పుష్కలంగా ఉండడంతో పాటు ఎగువ నుంచి నిరాటంకంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్న నేపథ్యంలో గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం ఆయకట్టులో వానాకాలం పంటల సాగునీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో చర్చించిన మూసీ అధికారులు గురువారం సాయంత్రం నీటి విడుదలకు నిర్ణయించారు. 645 అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 641.80అడుగుల(3.64టీంసీలు) నీరు నిల్వ ఉంది. ఈ నీటితో ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు వారబందీ పద్ధతిన నాలుగు విడతలుగా సాగు నీటిని అందించనున్నట్లు మూసీ డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు.

10వ డిస్ట్రిబ్యూటరీ వద్ద కోతకు గురైన కాల్వ కట్ట

మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు సాగునీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో కాల్వ కట్ట కోతకు గురైన 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ చర్చనీయాంశమైంది. కుడి ప్రధాన కాల్వపై 20కిలోమీటర్ల దూరంలో ఉన్న చీకటిగూడెం గ్రామ శివారులోని ఈ డిస్ట్రిబ్యూటరీకి ప్రధాన కాల్వ కట్ట భారీగా కోతకు గురైంది. కాల్వకు నీటి విడుదలైతే నీటి ఒత్తిడికి గాతు(బుంగ మాదిరిగా) మరింత పెరిగి ప్రధానకాల్వ కట్టకు గండిపడే ప్రమాదం ఉందని సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూసీ అధికారులు ఈ గాతు పూడ్చివేతకు తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీటి విడుదల షెడ్యూల్ ఇలా...

మూసీ అధికారులు తెలిపిన మేరకు మూసీ నీటి విడుదల షెడ్యూలు ఇలా ఉండనుంది. ఆయకట్టుకు మొదటి విడతగా ఈ నెల 25 నుంచి ఆగస్టు 18 వరకు 25 రోజుల పాటు, 15 రోజుల విరామం తర్వాత రెండో విడత నీటిని సెప్టెంబరు 3 నుంచి సెప్టెంబరు 17 వరకు 15 రోజుల పాటు, 15 రోజుల విరామం తర్వాత అక్టోబరు 3 నుంచి అక్టోబరు 17వ తేదీ వరకు మూడో విడత నీటిని 15రోజుల పాటు, 15 రోజుల విరామం తర్వాత చివరిదైన నాల్గో విడత నీటిని నవంబరు 2 నుంచి నవంబరు 16వ తేదీ వరకు 15రోజుల విడుదలతో 115 రోజుల పంటకాలం పూర్తికానుంది. ఈ మేరకు గురువారం తొలి విడత నీటిని విడుదల చేసేందుకు మూసీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆనందంలో రైతులు

సూర్యాపేట రూరల్: మూసీ ఆయకట్టుకు నీటి విడుదల చేస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా 32 వేల ఎకరాల భూమి సాగవుతోంది. మూసీ ఆధునికీకరణ పనులు పూర్తి కాకపోవడంతో ఈసారి కూడా చివరి భూములకు సాగునీరు అందే పరిస్థితి కనబడటం లేదు. అధికారులు కాల్వలపై పర్యవేక్షణ పెంచి అక్రమంగా తూములను తెరవకుండా చూడాలని చివరి భూముల రైతులు కోరుతున్నారు.

503.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.5050టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 503.50 అడుగులుగా(120.8990 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5,882క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 2,765 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 9,447 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు. సాగర్ వరద కాలువకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదలలేదు.అదేవిధంగా ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 175అడుగులు(45.77టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 102 అడుగులుగా (0.94 టీఎంసీలు) నమోదైంది. ఎగువ నుంచి 509 క్యూసెక్కుల నీరు వస్తుండగా, దిగువకు నీటి విడుదల లేదు.

షట్టర్లకు మరమ్మతులు చేయిస్తాం: డీఈ

శాలిగౌరారం, జూలై 24 : నల్లగొండ జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు ఫీడర్ ఛానెల్‌లో శిథిలమైన షట్టర్లకు మరమ్మతులు చేసి నీరు వృథా కాకుండా చూస్తామని నీటి పారుదల శాఖ డీఈ సత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో కలిసి ఫీడర్‌ఛానెల్ షట్టర్లను, రెగ్యులేటర్లను ఆయన పరిశీలించారు. డీఈ వెంట ఐబీ ఏఈ రాములు, రైతులు ఉన్నారు.

పలు శాఖల్లో ఉద్యోగ బదిలీలు షురూ

నల్లగొండ, జూలై 24 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ ప్రక్రియలో భాగంగా సుమారు 101మంది ఉద్యోగులకు స్థానం చలనం కల్పించింది. ఇన్‌చార్జి జేడీ శ్రీనివాసరావు ఇప్పటికే హైదరాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో కొత్త అధికారి రావాల్సి ఉంది. డీడీఏలు, ఏడీఏలు, వీఏఎస్‌లు, వీఎల్‌వోలు, జేఈవోలు, ఎల్ఎస్ఏలు, వీఏలు, వోఎస్‌లను బదిలీ చేశారు. జిల్లాలో మొత్తం 121 పశువైద్య, గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. ఆయా పశువైద్య కేంద్రాలల్లో డాక్టర్లతో పాటు ఉద్యోగులంతా కొత్తవారు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే కొంతమంది అధికారులకు, ఉద్యోగులను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నెలాఖరు వరకు బదిలీల ప్రక్రియ వివిధ శాఖలలో కొనసాగనుంది.

మునిసిపల్ కార్యాలయంలో పలువురికి

రామగిరి : నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. పట్టణ ప్రణాళికాధికారి(ఏసీపీ) నాగిరెడ్డి జీహెచ్ఎంసీకి, సీనియర్ గణాంకాధికారి కల్పన మిర్యాలగూడకు బదిలీఅయ్యారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ దేవరకొండకు, మూర్తుజా కోదాడకు, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌రెడ్డి భువనగిరికి, జూనియర్ గణాంకాధికారి పద్మ దేవరకొండకు, జూనియర్ అసిస్టెంట్లు భాగ్యమ్మ, ఈశ్వర్ మజీద్‌ఖాన్ మిర్యాలగూడ మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. బిల్‌కలెక్టర్ సైదులు మిర్యాలగూడకు, జగన్నాథం-నకిరేకల్ మునిసిపాలిటీలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారి స్థానంలో నల్లగొండ పురపాలికకు జీహెచ్ఎంసీ నుంచి టీపీబీవో ఖుద్దుస్, టీపీఎస్‌గా సుకన్య బదిలీపై వచ్చారు. దేవరకొండ నుంచి జూనియర్ గణాంకాధికారి రాజ్‌బబ్బార్, మిర్యాలగూడ నుంచి సీనియర్ గణాంకాధికారి స్నేహలత, సీనియర్ అసిస్టెంట్ కల్యాణి, యూడీఆర్ఐ రహీం, జూనియర్ అసిస్టెంట్లు, బిల్‌కలెక్టర్ నాగజ్యోతి, సత్యనారాయణ, చంద్రశేఖర్, పుష్పలత, భిక్షలను నల్లగొండకు బదిలీచేశారు. మరో రెండు మూడు రోజుల్లో ఇంజనీర్ల బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

జూనియర్ కళాశాల్లో ఉద్యోగుల బదిలీలపై అయోమయం

నల్లగొండ, జూలై 24 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియపై అయోమయం నెలకొంది. బదిలీలకు ప్రభుత్వం ఇచ్చిన గడువు దగ్గర పడుతున్నా ఇప్పటివరకు ఖాళీల జాబితాను విడుదల చేయకపోవడంతో అసలు బదిలీలు జరుగుతాయా లేదా అన్న సందేహం నెలకొంది. ఖాళీల విషయంలో స్పష్టత ఇవ్వడంలో ఇంటర్మీడియట్ అధికారులు జాప్యం చేస్తుండటంపై ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి పలు అనుమానాలు వ్యక్తంచేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 3,800మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులైజేషన్ చేశారు. అందుకు సంబంధించి వారి స్థానాలకు ఖాళీలు చూపించకపోవడంతో దీర్ఘకాలికంగా మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీల్లో పారదర్శకత పాటించాలని కోరుతున్నారు. ఇంటర్ విద్యావ్యవస్థలో బదిలీలను పారదర్శకంగా నిర్వహించి వేలాది మంది లెక్చరర్లకు, ప్రిన్సిపాల్స్‌కు, నాన్‌టీచింగ్ సిబ్బందికి న్యాయం చేయాలని పరిరక్షణ సమితి కోరుతోంది.

ఎఫ్‌సీఐ నుంచి 186 మంది డీపీఎస్ లేబర్స్ బదిలీ

● మూడు రోజుల్లో ఉత్తర్వులు అందే అవకాశం

మిర్యాలగూడ, జూలై 24 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కి చెందిన బఫర్ స్టోరేజ్ కాంప్లెక్స్(బీఎస్‌సీ) గోదాం నుంచి 186 మంది డైరెక్ట్ పేమెంట్‌లేబర్ సిస్టమ్(డీపీఎస్) లేబర్స్‌ను చర్లపల్లి బీఎస్‌సీకి బదిలీ చేస్తూ ఎఫ్‌సీఐ రీజనల్ మేనేజర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం డివిజనల్ మేనేజర్లకు ఉత్తర్వుల ప్రతులు అందినట్లు తెలిసింది. ఈ మేరకు లేబర్ యూనియన్‌లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. మిర్యాలగూడ బీఎస్‌సీలో డీపీఎస్‌లో పనిచేసే హమాలీ లేబర్ 205 మంది ఉండగా వారిలో కొందరు చనిపోగా మరికొందరు అనారోగ్యం బారిన పడిన వారు ఉన్నారు. మిగతా 186మంది పనిచేస్తున్నారు. వీరందరినీ చర్లపల్లి ఎఫ్‌సీఐ బఫర్ స్టోరేజీ కాంప్లెక్స్‌కు బదిలీ చేశారు. మరో మూడు రోజుల్లో బదిలీ ఉత్తర్వులు అందే అవకాశం ఉంది. కాగా ఇక ముందు ఎఫ్‌సీఐ హమాలీ పనులు కాంట్రాక్ట్ హమాలీలతో చేయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2017లో నల్లగొండ ఎఫ్‌సీఐలోని డీపీఎస్ లేబర్‌ను చర్లపల్లికి బదిలీ చేసి కాంట్రాక్టు లేబర్‌ద్వారా పనులు చేయిస్తున్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీఐ ఫుడ్‌స్టోరేజీ డిపో(ఎఫ్ఎస్‌డీ) సనత్‌నగర్, బీఎస్‌సీ మిర్యాలగూడ లేబర్‌ను చర్లపల్లి బీఎస్‌సీకి, జమ్మికుంట, ఖమ్మం బీఎస్‌సీలకు చెందిన లేబర్‌ను ఎఫ్ఎస్‌డీ ఖాజీపేటకు బదిలీ చేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ప్రస్తుతం పనిచేస్తున్న కేంద్రం నుంచి బదిలీపై వెళ్తున్న హెడ్‌క్వార్టర్‌కు 300 కిలోఓమీటర్ల పరిధిలోని వారు మూడు రోజుల్లో, 600 కిలోమీటర్ల దూరంలో ఉంటే ఆరు రోజుల్లో 900 కిలోమీటర్ల దూరం ఉంటే తొమ్మిది రోజుల్లో, అంతకంటే దూరం ఉన్న వారు 12 రోజుల్లోగా బదిలీ అయినచోట రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం.

కిరాయికి కాడెడ్లు

● వానాకాలం సీజన్‌కు జత ఎడ్లకు రూ.20వేలు

భువనగిరి రూరల్, జూలై 24 : ఎడ్లు కొనే స్థోమత లేని రైతులు సాగుకు అవసరమైన కాడెడ్లను కిరాయి(అద్దె)కి తెచ్చుకుంటున్నారు. వానాకాలం సీజన్‌కు జత ఎడ్లకు రూ.20 వేలు చొప్పున కిరాయి చెల్లిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి పంట సాగు చేసే కొందరు రైతులు ఇతర ప్రాంతాల నుంచి అద్దెకు కాడెడ్లు తెస్తున్న పరిస్థితి ఉంది. పత్తి సాగు చేసేటప్పుడు విత్తనం వేయడానికి ముందు అచ్చు తోలకం, విత్తనం నాటి పత్తి మొలకెత్తిన వారం రోజుల నుంచి కలుపు, గడ్డి మొక్కలు తొలగించేందుకు గొర్రు, గుంటుకతో దున్ని పొలాన్ని చదునుచేస్తారు. పత్తి పైరు ఏపుగా పెరిగి పూత, కాయ దశకు వచ్చే వరకు తరుచూ నాలుగైదుసార్లు గొర్రు, గుంటుకతో దున్ని పైపాటు చేస్తారు. సాగు నీరు పత్తి మొక్కలకు అందేలా అరకతో తోలకం కూడా చేయాల్సి ఉంటుంది. ట్రాక్టర్ రోటావేటర్‌తో ఈ వెసులుబాటు లేకపోవడం వల్ల ట్రాక్టర్‌తో పాటు గుంటుక తీసే అవకాశంలేదు. జత ఎడ్లను కొనుగోలు చేయాలంటే రూ.2 లక్షల వ్యయమవుతోంది. భువనగిరి, బీబీనగర్ మండలంలోని పలు గ్రామాల రైతులు పశువుల పెంపకందారుల వద్ద నుంచి కాడెడ్లను అద్దెకు తెచ్చుకుంటున్నారు. అయితే ఎకరానికి రూ.1000 చొప్పున నాలుగు ఎకరాలు ఉన్న రైతుకు రూ.4వేలు ఖర్చు అవుతోంది. ఐదు సార్లు కాడెడ్లు అవసరం పడుతుండటంతో మొత్తం ఒక సీజన్‌కు రైతుకు రూ.20వేల ఖర్చు అవుతోంది. ఈ మధ్య కాలంలో అద్దె కాడెడ్లకు కూడా మంచి డిమాండ్ ఉంది.


వీరవెల్లిలో కిరాయి ఎడ్లతో గుంటుక తీస్తున్న రైతు

ఎడ్లు కొనే స్థోమత లేదు



సొంత పొలంతో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. అందులో పత్తి సాగు చేస్తున్నా. పైర్లలో తరుచూ గొర్రు, గుంటుక తీసి పైపాటు చేసేందుకు ఒక జత ఎడ్లను కిరాయికి తెచ్చుకున్నా. వానాకాలం వ్యవసాయ సీజన్‌లో ఐదు సార్లు గుంటుక తీసేందుకు రూ.20వేల కిరాయి చెల్లించడంతో పాటు పోషణ బాధ్యత కూడా తీసుకున్నా. నాకు ఎడ్లు కొనే స్తోమత లేదు. ఎడ్లను కిరాయికి తీసుకుని ప్రతీ సీజన్‌లో గుంటుక తదితర వ్యవసాయ పనులు చేసుకుంటున్నా.

శోకం కృష్ణమూర్తి, రైతు
వీరవెల్లి, మండలం భువనగిరి

రోడ్డుపై గుంతలు.. వాహనదారుల తంటాలు


లింగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

చౌటుప్పల్ టౌన్, జూలై 24: చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి నుంచి లింగారెడ్డిగూడెం వైపు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో గుంతలు కన్పించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న ముసురుతో బీటీరోడ్డుపై ఐదారు చోట్ల ఏర్పడిన గుంతలతో వాహనదారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హైవే నుంచి సుమారు వంద మీటర్ల దూరంలో ఆర్అండ్‌బీబీటీ రోడ్డుకు ఇరు వైపులా ఏర్పడిన ఈ గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. చౌటుప్పల్ పట్టణం నుంచి వలిగొండ మీదుగా భువనగిరికి వెళ్లే ప్రధాన రోడ్డు వ్యాపారపరంగా రద్దీగా ఉంటుంది. రోడ్డుపై సుమారు 20 నుంచి 30మీటర్ల పొడవులో గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని డీవైఎఫ్ఐ నాయకులు రెండు రోజుల క్రితం ఆందోళన చేసి, అధికారులకు సైతం విన్నవించారు. హైవే నుంచి లింగారెడ్డి గూడెం వైపు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును 1.4 కిలో మీటరు పొడవున డబుల్ రోడ్డుగా మార్చేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన ప్రతిపాదన మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7కోట్లను మంజూరు చేసింది. కొద్ది రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

రెండు, మూడు రోజుల్లో గుంతలు పూడ్చి వేయిస్తాం

పట్టణంలోని జాతీయ రహదారి నుంచి లింగారెడ్డిగూడెం వైపు వెళ్లే ఆర్ అండ్‌బీరోడ్డుపై ఏర్పడిన గుంతలను రెండు, మూడు రోజుల్లో పూడ్చి వేయిస్తా. ఐదు రోజులుగా కురుస్తున్న ముసురుతో గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసకుంటాం. కొన్ని రోజుల్లో డబుల్ రోడ్డు పనులు ప్రారంభమవుతాయి. గుంతల సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది.

● వెన్‌రెడ్డి రాజు, మునిసిపల్ చైర్మన్

సీసీరోడ్డు వేశారు.. కొత్త సమస్య తెచ్చారు


ఎర్రంబెల్లిలో సీసీరోడ్డుపై గుంతలో నిలిచిన వర్షం నీరు

భువనగిరి రూరల్, జూలై 24: సీసీరోడ్డు నిర్మాణం అస్తవ్యస్తంగా చేపట్టడంతో చిన్నపాటి వర్షానికి నీరు సీసీరోడ్డు మధ్యలో గుంతలో చేర డంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని నమాత్‌పల్లి నుంచి ఎర్రంబెల్లి వరకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.15 లక్షలతో దాదాపు 300మీటర్ల సీసీరోడ్డు నిర్మించారు. సీసీరోడ్డు నిర్మాణం సక్రమంగా లేకపోవడం, రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వరద నీరు అంతా ఆ గుంతలో చేరుతుంది. దీంతో స్థానికులు, వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కరించేందుకు వేసిన సీసీరోడ్డుతో కొత్త సమస్య రావడంతో గ్రామస్థులు అయోమయానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా సీసీరోడ్డుపై గుంతను సరిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీసీరోడ్డు అస్తవ్యస్తంగా వేయడంతో ఇక్కట్లు

అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.15లక్షల నిధులతో సీసీరోడ్డు మంజూరు చేశారు. ఎన్నికల అనంతరం మూడు నెలలకు నమాత్‌పల్లి నుంచి ఎర్రంబెల్లి మార్గంలో సీసీరోడ్డు నిర్మాణాన్ని సదరు కాంట్రాక్టర్ అస్తవ్యస్తంగా చేపట్టడంతో ఉన్న సమస్య కంటే కొత్త సమస్యతో ఇబ్బంది పడుతున్నాం.

● గొర్ల అయిలయ్య యాదవ్, ఎర్రంబెల్లి,

సమస్యను పరిష్కరిస్తాం

నమాత్‌పల్లి నుంచి ఎర్రంబెల్లి వరకు రూ.15లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మించారు. ఆ రోడ్డు ఏటవాలుగా ఉండడం, కొత్త, పాత రోడ్డు మధ్య గుంత ఏర్పడింది. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు ఇప్పటికీ బిల్లు మంజూరు కాలేదు. మంజూరు అయిన వెంటనే ఆ గుంతను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

● ఎస్. ప్రసాద్, పీఆర్ఏఈ భువనగిరి.

చలో అసెంబ్లీని విజయవంతం చేయాలి


భిక్షాటన చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 24: గ్రామపంచాయతీ కార్మికులకు తొమ్మిది నెలలుగా జీతాలు లేవని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీన నిర్వహించే చలో అసెంబ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ పిలుపు నిచ్చారు. యూనియన్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి బుధవారం భిక్షాటన చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపక పోవడం బాధాకరమన్నారు. పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి గడ్డం ఈశ్వర్, నాయకులు బాబు, చుక్క కిష్టయ్య, నర్సమ్మ, జయమ్మ, సిరిపంగి శంకరయ్య, కుక్క పద్మ, పొట్ట పోషమ్మ పాల్గొన్నారు.

దేవస్థానం ఉద్యోగులను బదిలీ చేయాలి

యాదగిరిగుట్ట రూరల్, జూలై 24: యాదగిరిగుట్ట దేవస్థాన ఉద్యోగులను బదిలీ చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. గుట్టలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేవస్థానం ఉద్యోగులు ఇక్కడే ఉద్యోగంలో నియమితులై ఇక్కడే ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. బదిలీలు అవుతున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతుండగా కొంతమంది ఉద్యోగులు బదిలీ కాకుండా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కలిసి బదిలీలు నిలిపివేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు ఆరోపించారు. దేవస్థాన ఉద్యోగులను బదిలీ చేయాలని గతంలో కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత మెతక వైఖరి అవలంబించడం ఏమిటని ప్రశ్నించారు. కొంతమంది అధికారులు కొండపైన బినామి పేర్లతో కంట్రాక్టర్ తీసుకొని దేవస్థానం ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపించారు. సురక్షణ పేరుతో కొండపైన కాంట్రాక్ట్ ఉద్యోగులుగా స్థానికులకు అవకాశం ఇవ్వకుండా ఇతర జిల్లాల నుంచి తీసుకుంటుండడంతో స్థానిక నిరుద్యోగులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. సమావేశంలో నాయకులు బందారపు మల్లేష్, దొమ్మాట ప్రభాకర్, మందోజు నరేష్, బోడ బుచ్చిబాబు, పలుగుల సురేష్, బూడిద సన్నీ, శివ పాల్గొన్నారు.

చాకిలిగిద్దె చెరువులో మట్టి తవ్వకాలు


మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

యాదగిరిగుట్ట రూరల్, జూలై 24: యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని చాకిలిగిద్దె చెరువులో కొందరు వ్యాపారులు ఎక్సకవేటర్‌తో బుధవారం మట్టి తవ్వకాలు జరిపి టాక్టర్లతో తరలించారు. ఈ విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆర్ఐ విజయసింహారెడ్డి పోలీ సుల సహకారంతో చెరువు వద్దకు చేరుకొని మూడు ట్రాక్టర్లు, ఒక ఎక్సకవేటర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. ట్రాక్టర్ల ద్వారా 40 ట్రిప్పుల మట్టి తరలించారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

మోటకొండూరు, జూలై 24: రామన్నపేటలో జూలై 27, 28వ తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లురి ఆంజనేయులు పిలుపునిచ్చారు. సీఐటీయూ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోసంగి పరమేష్, బోగారం వీరస్వామి, తొండల సతీష్, పాండు, వంగపల్లి దయాకర్, ఆడెపు శ్రీధర్, వెంకటయ్య పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రత పాటించాలి'

భువనగిరి టౌన్, జూలై 24: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. 20వ వార్డులో బుధవారం పర్యటించారు. వార్డును సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని, సమస్యలపై స్థానిక కౌన్సిలర్ లేదా చైర్మెన్, మునిసిపల్ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను మునిసిపల్ చెత్త సేకరణ సిబ్బందికి అందజే యాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామాంజల్‌రెడ్డి, ఏఈ కొండల్‌రావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగస్వాములు కావాలి

భువనగిరి టౌన్, జూలై24: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెళ్ళ రమేశ్, రాష్ట్ర అధికార ప్రతినిధి బొట్ల శంకర్ అన్నారు. భువనగిరిలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. లక్ష్య సాధనకు ఆగస్టు 9వ తేదీన ఢిల్లీలో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. మరో సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాలన్ని ఆగస్టు చివరి నాటికి ప్రతి గ్రామంలో నిర్వహించి జెండా ఎగురవేయాలన్నారు.

అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు


అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు జూలకంటి, వెంకట్

సంస్థాన్‌నారాయణపురం, జూలై 24: ప్రజల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన పుట్టపాక అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి. వెంకట్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలంలోని పుట్టపాకలో సీపీఎం దివంగత నాయకులు మర్రి నర్సిరెడ్డి, సుక్క అబ్బయ్య, నడికుడి శంకరయ్య, నడికుడి బచ్చయ్యల 25వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. సీపీఎం నాయకులు అమరులై 25ఏళ్లు గడిచినా స్థానిక కార్యకర్తలు వారి ఆశయ సాధనలో, ప్రజలు మమేకమై పనిచేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.48లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ గత సంవత్సరంతో పోలిస్తే పెరిగినప్పటికీ పేదలకు ఉపయోగపడే విధంగా లేదన్నారు. అత్యధిక శాతంగా ఉన్న పేద మధ్యతరగతి ప్రజల నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఏటా రూ.26లక్షల కోట్ల ఆదాయం వస్తున్నా ప్రజలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేపట్టలేదన్నారు. అతి తక్కువ శాతంగా ఉన్న పెట్టుబడిదారులకు బడ్జెట్ ఉపయోగపడే విధంగా ఉందన్నారు. అమరవీరులపై రూపొందించిన సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్, సీనియర్ నాయకులు సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, దొడ యాదిరెడ్డి, దొంతగోని పెద్దలు, శ్రీనివాసచారి, మర్రి వసంత, ముత్యాలు, పిట్ట రాములు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, నాంపల్లి చంద్రమౌళి, చంద్రశేఖర్, ఐతరాజు గాలయ్య పాల్గొన్నారు. పుట్టపాక అమరవీరుల వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఏసీపీ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు.

వదలని ముసురు.. ముందుకు సాగని పనులు


మోత్కూరు : పొడిచేడు గ్రామంలో కూలిన ఇంటి పైకప్పు

మోత్కూరు, జూలై 24: మోత్కూరు మండలంలో వారం రోజులుగా ముసురు కురుస్తోంది. మండలంలోని పొడిచేడు గ్రామంలో నల్ల ధనుంజయకు చెందిన పెంకుటిల్లు బుధవారం ఉదయం తెల్లవారుజామున పైకప్పు కుప్పకూలింది. తల్లిదండ్రులు, భార్యాపిల్లలు లేకపోవడంతో ఆ ఇంట్లో ధనుంజయ ఒంటరిగా ఉంటున్నాడు. అతను ఇంటి ముందు వరండాలో నిద్రించడంతో ప్రాణాపాయం తప్పింది. నిరుపేదనైన తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. బుధవారం మండలంలో రోజంతా ముసురు కురిసింది. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనులు సాగక ఇబ్బంది పడ్డారు. భారీ వర్షాలు కురియక, ముసురు కురుస్తుండడంతో తమకు పెద్దగా ప్రయోజనం లేకపోగా, వ్యవసాయ పనులు సాగడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. తెడతెరిపిలేని ముసురుతో వరి, పత్తి, కంది పంటలకు తెగుళ్లు సోకుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వలిగొండ: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం ముసురు కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృత్తమై చల్లని గాలులు వీచి, చిరుజల్లులతో వర్షం కురిసింది. చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. మూసీ నదిలోకి వరద నీరు మెల్లగా చేరుతుంది. బీటీ రోడ్లు వర్షపు నీరుతో దెబ్బతిన్నాయి.

భువనగిరి రూరల్: వర్షం కురవాలని భువనగిరి మండలం గౌస్‌నగర్ గ్రామంలో బుధవారం మహిళలు బతుకమ్మ ఆట ఆడారు. మూడు రోజుల నుంచి ముసురు కురుస్తున్నా పంటలకు ప్రయోజనం లేదని చెబుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ వరుణ దేవుడిని వేడుకుంటూ గ్రామంలోని ముఖ్య కూడళ్లలో గ్రామ మహిళలు బతుకమ్మ ఆట ఆడారు.

ఘనంగా మాజీమంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు


ఆలేరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్: మాజీమంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. భూదాన్‌పోచంపల్లిలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, పాటి సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు. గుండాల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, రంజిత్‌రెడ్డి, మహేద య్, వేణుగోపాల్‌రెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు. రామన్నపేటలో టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేష్ కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోషబోయిన మల్లేష్, బందెల రాములు, శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, వేమవరం సుధీర్ బాబు, అశోక్, రేఖ, యాదయ్య, వెంకటేష్, ఎండీ అమీర్ పాల్గొన్నారు. చౌటుప్పల్‌లో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, ఊడుగు మల్లేశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, డిల్లీ మాధవరెడ్డి పాల్గొన్నారు. ఆలేరులో కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, మునిసిపల్ చైర్మన్ వాస్‌పరీ శంకరయ్య, పుట్ట మల్లేశంగౌడ్, రామ్‌నరసయ్య, రామ్‌గోపాల్‌రెడ్డి, వెంకటేష్, రాములు, శ్రీకాంత్, నర్సింహులు, సంతోష్ తదితరులు ఉన్నారు. రాజాపేటలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సట్టు తిరుమల్లేష్, వెంకటరామ్‌రెడ్డి, సందెల భాస్కర్‌గౌడ్, జశ్వంత్, ఉప్పలయ్య పాల్గొన్నారు. అడ్డగూడూరులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి అయోధ్య ఉన్నారు. సంస్థాన్‌నారాయణపురంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్రి నరసింహ, కట్టెల బిక్షపతి, కత్తుల సురేష్, పాండునాయక్, మైల యాదవరెడ్డి, శేఖర్‌రెడ్డి, దోటి జంగయ్య పాల్గొన్నారు. మోత్కూరులో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీనివాస్, తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, బుషిపాక లక్ష్మీ, కొండ సోంమల్లు, బయ్యని పిచ్చయ్య పాల్గొన్నారు. తుర్కపల్లిలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్నెపురెడ్డి నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ధానావతు బీకునాయక్, గిద్దె కరుణాకర్, నవీన్‌కుమార్, భూక్య రవీందర్‌నాయక్ ఉన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం జూలై 24: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన నూతి సత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం ఆస్పత్రిలో చేరారు. నిరుపేద కుటుంబం, ఆర్థిక సోమతలేక ఇబ్బందులు పడుతున్న ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ద్వారా రూ.2లక్షల ఎల్‌వోసీని బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

వలిగొండ, జూలై 24: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కమిటీ సభ్యుడు కందాడి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన పోరుబాటలో భాగంగా వెల్వర్తి-కేర్చుపల్లిలో బుధవారం సర్వే నిర్వహించారు. వెల్వర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి స్వతంత్ర హోదా కల్పించాలన్నారు. గతంలో కేర్చుపల్లి గ్రామానికి నైట్ హల్ట్ బస్సు వచ్చేందని, ప్రస్తుతం ఆ సర్వీసు రద్దు కావడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేర్చుపల్లి-వెల్వర్తి గ్రామాల మధ్యన బీటీ రోడ్డు ఇరుకుగా ఉందని, రోడ్డు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముత్యాలు, బిక్షపతి, సాయిరెడ్డి , శ్రీనివాస్‌రెడ్డి బుచ్చిరెడ్డి, నర్సింహ, చంద్రయ్య పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలు నెరవేర్చాలి'

భువనగిరి అర్బన్, జూలై 24: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దివ్యాంగుల హక్కుల జాతీయ జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వరూపంగా ప్రకాష్, వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30, 31వ తేదీల్లో రామన్నపేటలో నిర్వహించే సంఘం మహాసభల కరపత్రాలను కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు జండగే ద్వారా ఆవిష్కరించజేయించారు. ఉన్నత విద్యలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ రూ.300 నుంచి రూ.3వేలకు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా దివ్యాంగుల పింఛన్ రూ.6వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహిళ జిల్లా కన్వీనర్ కొత్త లలిత, పాండాల కే. అంజన్, పి. గోపి పాల్గొన్నారు.

స్మితాసబర్వాల్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

రాజాపేట, జూలై 24: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యాలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు రాజాపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. స్మితాసబర్వాల్ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూకంటి ప్రవీణ్, రాజు, మహదేవ్, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు మండల వైద్యాధికారిపై విచారణ

అడ్డగూడూరు, జూలై 24: అడ్డగూడూరు మండల వైద్యాధికారి డాక్టరు ప్రవీణ్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై చౌటుప్పల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద బుధవారం పీహెచ్‌సీలో విచారణ నిర్వహించారు. ఈ నెల 23వ తేదీన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మండల పర్యటనలో భాగంగా మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల వైద్యాధికారిపై పలు ఆరోపణలు ఉన్నాయని ఈ నెల 23వ తేదీన ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీఎంహెచ్‌వో పాపారావు ఆదేశాల మేరకు చౌటుప్పల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద మండల వైద్యాధికారి, వైద్య సిబ్బందిని విచారణ చేశారు. నివేదికను కలెక్టర్, డీఎంహెచ్‌వోకు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆలేరులో సినిమా చిత్రీకరణ


సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

ఆలేరు రూరల్, జూలై 24: ఆలేరులో బుధవారం సినిమా షూటింగ్ చేశారు. మణీష్‌గౌర్, హాలీవుడ్ ఫిలిమ్స్ సమర్పణలో ప్రొడక్షన్ నెంబర్-2 సినిమా సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు టి. రామ్ మాట్లాడుతూ కుటుంబ కథ చిత్రమని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పలు సన్నివేశాలను చిత్రీకరించామని. త్వరలో సినిమాకు పేరు పెట్టబోతున్నమన్నారు. హీరోగా వేములపల్లి వసంతకుమార్, హీరోయిన్‌గా రమ్య, బలగం వీణ, శిరీష నటిస్తున్నారు. ఎడిటర్ వేణు, కో డైరెక్టర్‌గా జ్వాల సాయి, సంగీతాన్ని అనిల్‌కుమార్, కెమెరామెన్‌గా పీవీ నారాయణ, మేకప్‌మెన్‌గా నారాయణ వ్యవహరిస్తున్నారని తెలిపారు.



మోత్కూరు: మోత్కూరు అంగడిబజారు, పద్మశాలి కాలనీల్లోని ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 200 మంది విద్యార్థులకు రాపోలు పరంధాములు, సుదర్శన్, వెంకటేశ్వర్లు తన తండ్రి జ్ఞాపకార్థం బుధవారం రూ.80 వేల విలువైన టై, బెల్టు, షూ అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కమిషనర్ సి.శ్రీకాంత్, పాఠశాల చైర్మన్ జమీలా, దాతల తల్లి రాపోలు సుగుణమ్మ, రాపోలు వెంకటేశ్వర్లు, స్వాతి, హెచ్‌ఎం ఆర్.రవీందర్‌రెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు అవిశెట్టి అవిలిమల్లు, ఉపాధ్యాయులు బి.హనుమంతు, కె.అరుణాదేవి, బి.లలిత, కె.సౌజన్య, జ్యోతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భువనగిరి పట్టణానికి చెందిన ధీరావత్ రాజేష్ నాయక్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర మహాసభల్లో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్యనాయక్ ఆయనను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని రాజేష్‌నాయక్ తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.

తుర్కపల్లి: మండలంలోని సంగ్యాతండాకు చెందిన భానోతు రాజేష్ నాయక్ లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ ఆయనకు నియామక పత్రాలు అందజేశారు. నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు రాజేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

సంక్షిప్త సమాచారం..

బొమ్మలరామారం: అర్హులైన రైతులందరూ రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలని మర్యాల క్లస్టర్ ఏఈవో రాజశేఖర్ అన్నారు. మర్యాల రైతువేదికలో రైతుబీమాపై రైతులకు అవగాహన కల్పించారు. కొత్త పట్టాదారు రైతులకు జూన్ 28 వరకు పట్టాదారు పాస్‌బుక్ వచ్చినవారు మాత్రమే బీమా దరకాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 30వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. రైతు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు నామిని, ఆధార్‌కార్డు ఉండాలన్నారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు వయస్సున్న రైతులు దరఖాస్తు చేయాలని సూచించారు.

భువనగిరి రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఈ నెల 26న భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ తెలిపారు. భువనగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్బన్, రూరల్ పరిధిలో ప్రభుత్వం మిగులు భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని భువనగిరి పట్టణంలో అర్హులైన వారికి మంజూరైన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, గ్యాంగ్‌స్టర్ నయీం దౌర్జన్యంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములను తిరిగి రైతులకు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దీక్ష నిర్వహిస్తున్నట్లు దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

భువనగిరి రూరల్: భువనగిరి మండలం పంచాయతీ అధికారిగా మోరిగడి దినకర్ గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎం. అనురాధదేవి, ఆలేరు ఎంపీవోగా బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ ఉదయగిరి శ్రీనివాస్ ఉన్నారు.

గుండాల: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ కేబీఆర్ కన్వెన్షన్‌లో ఈ నెల 26, 27, 28వ తేదీల్లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్‌ను ఎస్ఐ సైదులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొడపర్తి భాస్కర్, ఉపాధ్యక్షులు సమద్‌పాషా, కోశాధికారి యాదగిరి, బాలరాజు, వెంకన్న, దిలీప్, సురేశ్, నవీన్ తదితరులున్నారు.



ఆత్మకూరు(ఎం): మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన శామ కూర చిత్రలేఖమధును బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ బుధవారం నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు చిత్రలేఖ కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మకూరు(ఎం): మండలకేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందని పసుల పిచ్చమ్మ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ తరుపున రూ.5వేల ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ జె.నగేష్ మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రత్నం శేఖర్ అనే యువకుడు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. అతని కుటుంబానికి గ్రామస్థులు సేకరించిన రూ.69,616లను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచు సుర్వి కాటంరాజుగౌడ్, మాజీ ఉప సర్పంచు సామ జంగారెడ్డి, నాయకులు సుర్వి శ్రీనివాస్ గౌడ్, మాడ్గుల హరిబాబు, కనకబోయిన భాస్కర్, కొమిరె విజయ్, పరమేష్, జి మధు తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: సైబర్ నేరాలపై, డ్రగ్స్ వ్యతిరేక కార్యకలాపాలపై అప్రతమ్తంగా ఉండాలని భూదాన్‌పోచంపల్లి ఎస్ఐ భాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని ముక్తాపూర్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై, చైన్ స్నాచింగ్, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుల్స్ యు. శ్రీను, డి. రాజశేఖర్, ఎ. వినోద్ కుమార్, కె. వెంకటేష్, గోవరన్ తదితరులు పాల్గొన్నారు.